# మనలేని 'మన' వూరు

ఈ మధ్య మనవూరు వెళ్లివచ్చావేమో, విశేషాలేమిటని అడిగావు.

విశేషాలకేం? చాలా వున్నాయిగాని-అసలు నాకు 'మన' అన్నదాని కర్థమేమిటో బోధపడడం లేదు. ఇలా అన్నానని నన్నొక పిచ్చివాడిగా పరిగణించ వనుకుంటాను.

నిజాని కాలోచించు! 'మన' అనే పదాన్ని మన అత్యంత ప్రేమైక విషయాలకు వాడుకుంటాంగదా! వాటినే-చనువుగా 'మన' అని పిలుచుకుంటామంతేగా!

కాని-ఇవేళ 'మన' అని నేను ఏ ప్రేమైక విషయాన్ననాలో అర్థం కావడం లేదు.

'మన' అని మనసారా పిలుచుకున్న మన రామారావుతో మనకిప్పుడెలాంటి సంబంధముందో నీకు తెలియంది కాదు

భవదీయుడు

ఇంకా అంతేకాదు - 'మనవూరు' అనుకన్న చోటున 'మన'దని అనుకోదగ్గ దిప్పుడేముందని? 'మనది' అని అనుకున్న యిల్లు-యిల్లురూపంలో లేదనీ, దాన్ని రామారావు నదనం చేయించాడనీ నీవింకా మరువలేవనుకుంటాను.

'మన' అనుకుంటున్న మిత్రులు మిత్రులుగా లేరు. బంధువులు బంధువులుగా లేరు; ఆప్తులు ఆప్తులుగా లేరు

'మన' బ్రతుకులు - రామారావు దయపై ఆధారపడి పోయాయి; చివరకు - 'మన' ప్రాణాలే రామారావు చేతుల్లో వున్నాయంటే నీవేమీ ఆశ్చర్య పడాల్సింది లేదు

ఇలా -'మన' వనేవేవీ మన చేతుల్లో లేవని తెలిశాక - ఇక ఏ విషయాన్ని 'మన' అనుకోవాలో, జాగ్రత్తగా ఆలోచిస్తే తోచకపోవచ్చు.

కాని - ఏమిటో 'మన' అని అనుకో బుద్ధే పుడుతుందెందుకనో? నాకు తెలియకుండానే - మన వూరు, మన ప్రజలు, మన మనుషులు, మన దేశం అని ఎంతో ఆప్యాయంగా వాడుతున్నానా పదాన్ని. అయితే - యీ 'మన' అనేది పై పెదవుల మీదినుండి రావడం లేదనీ, హృదయం నుండే వస్తున్నదనీ నీకు తెలిపితే నమ్మవేమో! అయినా - నీకు తెలిపేందుకయితే నేననడం లేదన్నది స్పష్టం. దానికి కారణాన్ని వ్యక్తీకరించలేనేమో ననుకుంటున్నాను. అయితే- శాంతంగా ఆలోచిస్తే దీనికి ఏదో మనస్సుకు సంబంధించిన కారణం దొరక్కపోదనీ, దాంతో నచ్చజెప్పుకో లేకపోమనీ తెలుసు-కాని, ఆచరణకు సంబంధించిన భౌతిక కారణం దొరుకుతుందా? అని.

ఏ కారణం దొరక్కపోయినా సరే-'మన'దనే ప్రేమను వీడలేను. ఎలా వీడగలను చెప్పు! ఆ 'మన' అనే పదానికి సంబంధించిన విషయాలన్నీ నన్ను సందర్భాన్నిబట్టి నవ్వించాయి; ఏడ్పించాయి; గౌరవించాయి; నాపై విశ్వాసాన్ని ప్రకటించాయి.

అవెలాగో-సూక్ష్మంగా చెప్ప ప్రయత్నిస్తే కొంతవరకూ అర్థం కావచ్చనుకొంటాను. మన వూరు వెళ్ళగానే-మన ప్రజలంతా నాచుట్టూ చేరారు. "నమస్కారమండీ! (చాలామంది "దండమండీ!") ఎప్పుడొచ్చారు? అమ్మా, నాన్నా అంతా బాగున్నారా?" అని వందల ప్రశ్నలు! ఈ గౌరవమంతా ఏమిటంటావు?

మనకుక్క-నన్ను యిన్నాళ్ళకు చూసినా, గబగబా తోకాడిస్తూ వచ్చి-నాపై గంతువేసి, ఎక్కడలేని సంతోషాన్నీ సూచిస్తూ, నా వొళ్ళంతా నాలుకతో ముద్దెట్టుకొంది.

అనేకమంది మిత్రులు 'టీ' కి రమ్మన్నారు; కొంతమంది పేదలు-పాలు పంపుతాం, త్రాగమని బలవంతం; మరి కొందరు మా యింటికంటే మా యింటికని భోజనాని కాహ్వానించారు.

మనదగ్గర-రాత్రి పాఠశాలలో చదువుకున్న హరిజన విద్యార్థులు - నేను మందలించేదాకా ఎలా మాట్లాడాలో తోచక ఆదోరకంగా కొత్త చేస్తూ మూలకు నుంచున్నారు.

మన రైతుపడుచు రంగమ్మ కాస్త ఎదిగింది. దూరంనుంచి-సిగ్గుగా తల వొంచుకొని వాలుగా చూస్తుంది.

మన రాఘవయ్యగారి చంటిది-నా సమీపానికొచ్చి-ప్రక్కనున్న రెండు గోడలమధ్య మూలన బిక్కమూతిని దాచిపెట్టి, "నేనొచ్చా! ఎత్తుకో"మ్మన్నట్టు జ్ఞాపకం చేస్తుంది.

రామారావు తల్లి వచ్చి-"ఇక మావాడి బతుకంతేనా?" అని పిచ్చిగా ఏడుస్తూ అడుగుతుంది- ఒంటరిగా కుములుతూ కొడుకుకై పరితపించే ఆ దిక్కులేని దీనురాలు.

ఇలా 'మన' వాళ్ళనుకున్నవారితో జరిగిన సన్నివేశాలన్నీ చెప్పుతూ పోవాలంటే- నాకూ జ్ఞాపకంరావు; నీకూ విసుగెత్తుతుందనుకుంటాను.

ఏమైనా- దాదాపు మన వూరు వాళ్ళంతా వేసే ముఖ్యప్రశ్న- "ఈ అల్లర్లు ఎప్పుడు తగ్గుతాయి?" అని.

నేనేం చెప్పేది? తగ్గుతాయననా? తగ్గవననా?

నేనేదో తెగ చదివినవాణ్ణనీ, నా ద్వారా అసలు సంగతి తెలుసుకోవచ్చనీ వాళ్ళు పాపం! తెగ తాపత్రయ పడతారు.

ఆమధ్య స్వరాజ్య మొస్తుంది, స్వరాజ్య మొస్తుందంటే పాపం! ఎంత సంతోషపడ్డారు! ఏమిటేమిటో ఆశించారు- ఎంతెంతో వూహించారు. అప్పుడు అంతగా ఆశించడం తప్పని వాళ్ళ సంతోషాన్ని భంగపరుస్తామా?

కాని-స్వరాజ్యం రాక ముందు వాళ్ళే పరిస్థితుల్లో వున్నారో-అంతకంటే అత్యంత క్లిష్ట, ప్రమాదకర, దుర్భర పరిస్థితుల్లో నేడున్నారనేది ఖాయం.

చివరకు స్వరాజ్యమంటే చంపుకోవడమేనా? ఇలాంటి స్వరాజ మెందుకొచ్చినట్టు? అని వాళ్ళు ప్రశ్నిస్తుంటే—అంతర్జాతీయ రాజకీయాలు తెలుసని మురుస్తూ, కాగితాలమీద వ్రాయడానికి చలామణయ్యే మనం, నోరు మూసుకొని, గుడ్లప్పగించాల్సి వస్తున్నది.

అయితే- ఏవో సమాధానాలు చెప్పలేనని కాదు- చెబుతాను; సవ్యంగానే చెబుతాను. కాని, వాళ్ళ కష్టాలుపోగొట్టే ఉపాయమేదీ? అదిలేనప్పుడెన్ని చెప్పియేం లాభం?

నిజానికి- వాళ్ళ తిండీ, బట్టకంటే ఎక్కువగా ఈ చంపుకోడాలూ, చావుదెబ్బలూ ఎలాతప్పుతాయంటారు. ఇక ప్రజాఉద్యమ మంటేనే భయపడుతున్నారు.

ఆనాడు - ఉద్యమాలకు జల్లిన విరాళాలూ, సభలకు కదిలివచ్చిన వేలాదిజనమూ, సత్యాగ్రహాలకు సంతోషంగా పరుగెత్తిన ప్రజలూ - ఇవేళ అవస్థలు పడుతూ, నిరాశానిస్పృహాలకు లోనై పోతూన్న వాళ్ళను కళ్ళారా చూస్తుంటే ఇక వాళ్ళనేమీ, ఏ విషయంలోనూ కదిలించ బుద్ధి పుట్టడంలేదు-

మనం - వాళ్ళ సానుభూతి సహకారాలతో, డబ్బుతో-విజ్ఞానపు బాటలు చూపేందుకు మన బుర్రను కరిగించి, శ్రమను ధారవోసి నిర్మించిన మన అత్యంత అభిమాన పాత్రమైన బ్రదుకుగా పరిగణించిన గ్రంథాలయాని కివేళ దినపత్రిక రాకపోగా, ఉన్న పుస్తకాలే చెదలు పట్టిపోతుంటే-ఎంత దుఃఖ మొస్తుందో వూహించు!

కాని, ఏంచేయాలి? అక్కడిప్పుడు గ్రంథాలయాన్ని నడిపేవారు లేరు. మనం పూనుకుంటే సహకరిస్తారంతే. అయితే మనమిప్పు డక్కడుండే పరిస్థితుల్లో లేమనేది నీకు తెలియంది కాదు. మొదటి భయం- సోదరులు! ఎలాగో అన్నిటినీ కోల్పోయి, ఒంటరిగా వుంటూ ప్రజల్లో లీనమై బిక్కుబిక్కుమంటూ తప్పుకుంటూ- ఇలాంటివన్నీ చూసుకుందామంటే- ఈ ప్రమాదపరిస్థితుల్లో పల్లెల్లో ఎలా వుండగలిగావని అధికార్ల అనుమానాలూ, ఆపైన అన్నీ ...! అదీ, కాదనలేం.

ఇదీ- 'మన' దుస్థితి!

'మన' వూరు గొడవ!!

'మన' దేశదౌర్భాగ్యం!!!